https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 02 సంచిక : 21 శుక్రవారం 15-05-2026 పేజీలు : 4

**రిపోర్టర్స్ కావలెను**

మన సమాజం Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాల్లో పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

## కేజ్రీవాల్‌పై కోర్టు ధిక్కరణ

**సిసోడియా, సంజయ్‌సింగ్, వినయ్ మిశ్రా, భరద్వాజ్‌లపైనా జస్టిస్ స్వర్ణకాంత శర్మ చర్యలు**

**ఈ చర్యలు కోపంతో తీసుకున్నవి కావు**

**రాజ్యాంగానికి కట్టుబడే ఈ నిర్ణయం**

**ఈ ఉత్తర్వులు కోర్టులో ఇస్తున్నాం బీజేపీ ఆఫీసులో కాదని వ్యాఖ్య**





**న్యూఢిల్లీ, మే 14**

ఢిల్లీ మద్యం విధానం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆప్ అధినేత కేజ్రీవాల్, ముఖ్య నేతలు మనీష్ సిసోడియా, సంజయ్‌సింగ్, వినయ్ మిశ్రా, సౌరభ్ భరద్వాజ్‌లపై ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం సాగించారనే ఆరోపణలపై గురువారం స్వచ్ఛందంగా కోర్టు ధిక్కరణ చర్యలను ప్రారంభించారు. అదే సమయంలో ఈ కేసు విచారణ నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించారు. 2021-22 ఢిల్లీ మద్యం విధానం కేసులో కేజ్రీవాల్, టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో సహా 23 మందిని ట్రయల్ కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన విషయం తెలిసిందే. దానిపై సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కానీ జస్టిస్ స్వర్ణకాంత శర్మ వద్ద నుంచి కేసు విచారణను మరో ధర్మాసనానికి మార్చాలని కేజ్రీవాల్, ఇతర నేతలు కోరారు. ఈ కేసును విచారించిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ కీలక నిర్ణయాలను ప్రకటించారు. కేజ్రీవాల్‌పై తాను కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో.. అదే కేసును తాను విచారించడం సబబు కాదని జస్టిస్ స్వర్ణకాంత శర్మ అభిప్రాయపడ్డారు. "నేను ఈ కేసు విచారణ కొనసాగిస్తే.. తనపై వ్యక్తిగత కక్షతో తీర్పు ఇచ్చారని కేజ్రీవాల్ భావించే అవకాశం ఉంది. అందుకే ఈ కేసును వేరే బెంచ్‌కు బదిలీ చేయాలని నిర్ణయించా. రాజ్యాంగ ధర్మాన్ని కాపాడే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నా" అని వివరించారు. తాను ఒక లా కాలేజీలో ప్రసంగించిన వీడియోను ఉద్దేశపూర్వకంగా ఎడిట్ చేసి.. ఆర్ఎస్ఎస్ వేడుకలో మాట్లాడినట్లు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. "కేజ్రీవాల్ దుష్ప్రచారానికి తెరలేపారు. న్యాయమూర్తి వీడియోలను ఎడిట్ చేసి పోస్ట్ చేయడం దురుద్దేశపూరిత చర్య. నన్ను ఎగతాళి చేయాలనేది ఆయన ఉద్దేశంగా కనిపిస్తోంది. రాజకీయ శక్తుల అంచనాలకు తగ్గట్టు న్యాయమూర్తి నడుచుకోకపోతే, కించపరుస్తామనే సంకేతాన్ని కేజ్రీవాల్ పంపుతున్నారు. ఈ ధోరణిని ఉపేక్షిస్తే న్యాయవ్యవస్థకే ముప్పు" అని జస్టిస్ స్వర్ణకాంత పేర్కొన్నారు. ఇక వినయ్ మిశ్రా చేసిన ఒక పోస్ట్‌ను ప్రస్తావిస్తూ.. "ఈ ఉత్తర్వు న్యాయస్థానంలో జారీ అవుతోంది. బీజేపీ ప్రధాన కార్యాలయంలో కాదు. వినయ్ మిశ్రా.. నేను మీపై ధిక్కార చర్య తీసుకుంటున్నాను, " అని స్పష్టం చేశారు.

## నీట్ రద్దు.. నోట్ల రద్దు లాంటిదే!

**మోదీ పదేళ్ల పాలనలో 93 పేపర్లు లీక్!**

**కేంద్రం తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం**



**హైదరాబాద్, మే 14**

నీట్-యూజీ 2026 పరీక్ష రద్దు నిర్ణయం దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిన పెద్ద నోట్ల రద్దు లాంటిదేనని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మోదీ సర్కారు నియంతృత్వ, నిరంకుశ నిర్ణయమని ఆరోపించారు. పదేళ్ల మోదీ పాలనలో 93 పేపర్లు లీకయ్యాయని తెలిపారు. పేపర్ లీక్ అయితే కనీసం సంబంధిత మంత్రిపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. వ్యవస్థీకృతంగా పేపర్ లీకులు, ప్రభుత్వ వైఫల్యాలు దేశ యువతను అనిశ్చితి, నిరాశలోకి నెట్టాయని చెప్పారు. ఏళ్ల తరబడి కష్టపడి చదువుకున్న విద్యార్థుల కలలు కల్లలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది తల్లిదండ్రులు అప్పులు చేసి, నగలు అమ్ముకొని పిల్లలను నీట్ పరీక్ష కోసం సిద్ధం చేస్తారని, వారి ఆశలన్నీ గల్లంతవడం బాధాకరమని అన్నారు. 2019 నుంచి 15 రాష్ట్రాల్లో ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయినా, ఒక్క కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేయలేదని గుర్తు చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలే ఈ లీక్‌లకు ప్రధాన కేంద్రాలుగా మారాయని ఆరోపించారు. 2014 మేలో మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దేశంలో ప్రభుత్వ పరీక్షా వ్యవస్థలో లోపాలు బహిర్గతం అయ్యాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ విడుదల చేసిన 'ది పేపర్ లీక్ డికేడ్' శ్వేత పత్రం ప్రకారం కేంద్ర, రాష్ట్ర పరీక్షల్లో 93 పేపర్ లీక్ ఘటనలు జరిగాయని తెలిపారు. వీటి వల్ల సుమారు రెండు కోట్ల మంది విద్యార్థులు ప్రభావితం అయ్యారని చెప్పారు. 2024లో కేవలం 8 వారాల్లోనే నాలుగు ప్రధాన జాతీయ పరీక్షలు రద్దయ్యాయని గుర్తుచేశారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో 14 లీక్‌లు జరిగాయని తెలిపారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హరియాణా వంటి ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. నీట్ రద్దు నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని.. రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## మెట్రోలో వెళ్తా.. ఈవీలు కొంటా

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



**హైదరాబాద్, మే 14**

ప్రధాని మోదీ సూచనల మేరకు తాను కూడా ప్రజా రవాణాకే ప్రాధాన్యం ఇస్తానని, అవసరమైన సందర్భాల్లో మెట్రో రైలులో వెళ్లి సమావేశాలకు హాజరవుతానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రకటించారు. ఒక నాయకుడి హోదాలో వివిధ కార్యక్రమాలకు వెళ్లాల్సివచ్చినప్పుడు తనతో పాటు సిబ్బంది కోసం మరో వాహనం వినియోగించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడున్న డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దేశ ఆర్థిక స్వావలంబన-జాతీయ ప్రయోజనాల కోసం ప్రధాని మోదీ సూచించిన 'సప్త సూత్రాలు' అంశంపై గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమన్నారు. మోదీ సూచనలు రాజకీయ అంశాలు కావని, వాటిని సామాజిక, ఆర్థిక కోణాల్లో చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని మోదీ స్వయంగా తన కాన్వాయ్‌లో 10 వాహనాలను తగ్గించుకుంటే..రాష్ట్రంలో సీఎం రేవంత్ కూడా వాహనాలను కుదించుకోవడం మంచిపరిణామమని అన్నారు.

## కేరళ సీఎంగా సతీశన్

**10 రోజుల ఉత్కంఠకు తెర.. ప్రజల్లో బలమున్న నేతవైపే మొగ్గు**

**చివరిదాకా రేసులో కేసీ, రమేశ్ చెన్నితాల.. 18న ప్రమాణం**



**న్యూఢిల్లీ, తిరువనంతపురం, మే 14:**

కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత.. 10 రోజుల సుదీర్ఘ ఉత్కంఠకు తెరదించుతూ కాంగ్రెస్ సీనియర్ నేత వి.డి. సతీశన్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ అధిష్ఠానం ఎంపిక చేసింది. సీఎం పదవి కోసం కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ వారిద్దరినీ కాదని సతీశన్ వైపు మొగ్గు చూపింది. ప్రజల్లో బలం ఉన్న నేత కావడం, మిత్రపక్షాలైన ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ వంటి పార్టీల నుంచి కూడా ఆయనకే మద్దతు లభించింది. 45శాతం ముస్లిం ఓటర్లు ఉన్న వయనాడ్‌లో.. అక్కడ ఎంపీగా ఉన్న ప్రియాంకాగాంధీకి క్షేత్రస్థాయిలో ఐయూఎంఎల్ మద్దతు అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో కూటమిలో ఉన్న మిత్రపక్షాన్ని నొప్పించడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 140 అసెంబ్లీ స్థానాలకు గాను, 102 చోట్ల ఘన విజయం సాధించింది. అయితే, పార్టీలోని 63మంది ఎమ్మెల్యేలలో 47మంది మద్దతుతో కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ చివరివరకు రేసులో ఉన్నప్పటికీ అధిష్ఠానం ఆచితూచి అడుగు వేసింది. ఒకవేళ ఆయనను సీఎం పోస్టుకు ఎంపిక చేస్తే ఎంపీ పదవికి రాజీనామా చేయాల్సి రావడం, ఆరు నెలల్లో ఉప ఎన్నిక ఎదుర్కోవాల్సి ఉండటంతో హైకమాండ్ ఆలోచనలో పడింది. క్షేత్రస్థాయిలో సతీశన్‌కు ఉన్న 'పీపుల్స్ చాయిస్' ఇమేజ్, కేసీ వేణుగోపాల్‌కు వ్యతిరేకంగా రాష్ట్రంలో వెలసిన పోస్టర్లు, కార్యకర్తల ఆందోళనల మధ్య సుదీర్ఘ చర్చల అనంతరం ఆయన్నే సీఎంగా ఖరారు చేసింది. ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయసేకరణలో ఇదే విషయం వెల్లడైంది. కాగా, ముఖ్యమంత్రిగా సతీశన్ మే 18న ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. కేరళ రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న 61ఏళ్ల సతీశన్.. సామాన్య కార్యకర్త నుంచి సీఎం స్థాయికి ఎదిగిన నేతగా గుర్తింపు పొందారు. వృత్తిరీత్యా కేరళ హైకోర్టులో న్యాయవాది అయినప్పటికీ.. లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తూనే సామాజిక అంశాలపై లోతైన అవగాహన పెంచుకున్నారు. ఎర్నాకుళం జిల్లా నెట్టూరులో జన్మించిన సతీశన్ రాజకీయ ప్రస్థానం కళాశాల దశలోనే ప్రారంభమైంది. ఎంజీ యూనివర్సిటీ నుంచి విద్యార్థి సంఘం నాయకుడిగా పనిచేసిన ఆయన.. ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చారు. అనంతరం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు చేపట్టి, కొచ్చి సమీపంలోని కమ్యూనిస్టుల కంచుకోట పరవూర్ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2021లో యూడీఎఫ్ ఓటమి పాలైనప్పటికీ రాహుల్ గాంధీ ప్రోత్సాహంతో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి సీఎం పినరయి విజయన్ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేశారు. పదేళ్లలో ఎల్‌డీఎఫ్ పాలనపై ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మార్చుకోవడంలో ఆయన కీలకపాత్ర పోషించారు.

## యూపీలో గాలివాన..

### మేఘ గర్జన117 మందిమృతి

**72 మందికి గాయాలు**

**నేలకొరిగిన చెట్లు, విద్యుత్తు స్తంభాలు, దెబ్బతిన్న ఇళ్లు**

**పలుచోట్ల వంతెనలు కూలి నిలిచిన రాకపోకలు**

**సహాయక చర్యలు వేగవంతం చేయాలని సీఎం యోగి ఆదేశం**

**50 అడుగుల ఎత్తుకు ఎగిరిపడిన వ్యక్తి.. సోషల్ మీడియాలో వైరల్**



లఖ్‌నవూ, మే 14: ఉత్తరప్రదేశ్‌లో అకాల వర్షాలు పెను విషాదాన్ని నింపాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలు, పిడుగుపాట్లతో తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. వివిధ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఘటనల్లో 117 మంది మృతి చెందగా, 72 మంది గాయపడ్డారు. 170 పశువులు మృత్యువాత పడ్డాయి. 227 ఇళ్లు దెబ్బతిన్నాయి. అత్యధికంగా ప్రయాగ్‌రాజ్ జిల్లాలో 24 మంది మృతి చెందగా, భదోహీలో 18 మంది, మీర్జాపూర్‌లో 15 మంది, ఫతేపూర్‌లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉన్నావ్, బదాయూన్, ప్రత్ష?పగఢ్, బరేలీ, సీతాపూర్, రాయ్‌బరేలీ, చందౌలీ జిల్లాల్లో కూడా భారీగా ప్రాణనష్టం జరిగింది. మృతుల కుటుంబాలకు రాష్ట్రప్రభుత్వం రూ.4 లక్షల పరిహారం ప్రకటించింది. రాష్ట్రంలో బుధవారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, భారీ క్యుములోనింబస్ మేఘాలు అనేక ప్రాంతాలను కమ్మేశాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలతో భారీ హోర్డింగులు, రేకుల షెడ్లు ఎగిరిపోగా, చెట్లు నేలకొరిగాయి. రోడ్లపై చెట్లు విరిగిపడడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని వాహనాలు చెట్ల కింద నలిగిపోయాయి. అనేక ఇళ్లు ధ్వంసమవగా, శిథిలాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు శ్రమిస్తున్నాయి. భదోహి జిల్లాలో ఓ వంతెన కూలి అనేక మంది గంగానదిలో పడిపోయారు. మీర్జాపూర్‌లో మరో వంతెన దెబ్బతిని దాదాపు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

## కేటీఆర్‌కు సమన్లు

**జూలై 31న విచారణకు రావాలి**

**ఫార్ములా-ఈ కారు రేసు కేసులో ఏసీబీ కోర్టు ఆదేశం**

**చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం**



**హైదరాబాద్, మే 14**

ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌ను ఏసీబీ కోర్టు పరిగణనలోకి తీసుకుంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఏ1 అయిన కేటీఆర్, ఇతర నిందితులైన ఐఏఎస్ అధికారి అరవింద కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ఎఫ్ఈవో అల్బర్ట్‌లను జూలై 31న విచారణకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. హైదరాబాద్‌లో ఫార్ములా ఈ కారు రేసు నిర్వహణకు 2023 అక్టోబరులో ప్రారంభమైన ఒప్పంద ప్రక్రియ తర్వాత ప్రభుత్వ అనుమతి లేకుండానే రూ.55 కోట్లు చెల్లించారన్న ఆరోపణలపై ఏసీబీ 2024 డిసెంబరులో కేసు నమోదు చేసింది. అధికార దుర్వినియోగం, ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై దర్యాప్తు ప్రారంభించిన ఏసీబీ అధికారులు కేటీఆర్ తదితరులను పలుమార్లు విచారించారు. పలువురు ఐఏఎస్, హెచ్ఎండీఏ, ఆర్థిక శాఖ అధికారులను ప్రశ్నించారు. నిధుల బదిలీలో ఆర్‌బీఐ నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై బ్యాంకుల అధికారులను కూడా విచారించారు. పలు కీలక పత్రాలు, డిజిటల్ ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, ఒప్పంద పత్రాలను ఏసీబీ స్వాధీనం చేసుకుంది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ కోణం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో రంగంలో దిగిన ఈడీ అధికారులు సైతం కేటీఆర్, అరవిందకుమార్, బీఎల్ఎన్ రెడ్డి తదితరులను విచారించారు. విదేశీ సంస్థకు జరిగిన చెల్లింపులు, నిధుల బదిలీ, ఒప్పందాలపై ఆరా తీశారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాలు, వాంగ్మూలాలు, ఆర్థిక లావాదేవీల ప్రకారం గవర్నర్ అనుమతి వచ్చిన తర్వాత ఏసీబీ అధికారులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దానిని పరిశీలించిన ఏసీబీ కోర్టు గురువారం అధికారికంగా విచారణకు స్వీకరించి నిందితులకు సమన్లు జారీ చేయడంతో ఈ కేసు రాజకీయంగా, న్యాయపరంగా మరో దశకు చేరుకుంది.

# “బక్రీద్ ఏర్పాట్లపై కమిషనర్ సీరియస్..!

## - ‘ఎక్కడా అలసత్వం కనిపించొద్దు’ - అంటూ అధికారులకు వార్నింగ్”



కమ్యూనిటీ క్యాటిల్ హాస్టల్‌లో పశువుల వసతిపై ఆరా తీసున్న సీపీ సాధన రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట, మే 14**

బక్రీద్ పండుగ సందర్భంగా భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ అధికార యంత్రాంగానికి కఠిన ఆదేశాలు జారీ చేశారు. డీజీపీ సూచనల మేరకు పొన్నాల గ్రామ శివారులోని పశువుల చెరువు, కమ్యూనిటీ క్యాటిల్ హాస్టల్‌ను పరిశీలించిన కమిషనర్... “ప్రజలకు ఇబ్బందులు కలిగితే బాధ్యులపై చర్యలు తప్పవు” అని హెచ్చరించినట్లు సమాచారం. సుమారు 400 పశువులను ఉంచగల కమ్యూనిటీ క్యాటిల్ హాస్టల్‌లో పశువుల వసతి, తాగునీరు, పారిశుధ్యం, వెటర్నరీ సేవలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. పండుగ సమయంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. బక్రీద్ వేళ శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రవీందర్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కొండల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అర్షిత్ కుమార్, వెటర్నరీ డాక్టర్ వేణుగోపాల్ తదితర అధికారులు పాల్గొన్నారు. బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అన్ని అవసరమైన చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు.

# హర్మూజ్ జలసంధిని దాటిన భారత్ నౌకలు

**అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు**

**శాంతి ఒప్పందంపై ట్రంప్ అసంతృప్తి వ్యక్తం**

**న్యూఢిల్లీ, మే 14**

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ భారత్‌కు ఊరటనిచ్చే వార్త వెలువడింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతం నుంచి భారత దేశానికి వంటగ్యాస్ సరఫరా చేస్తున్న రెండు భారీ నౌకలు వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటాయి. ప్రపంచ ఇంధన వాణిజ్యానికి గుండెకాయ వంటి ఈ సముద్ర మార్గంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, రవాణా వ్యవస్థ క్రమంగా పునరుద్ధరణ దిశగా అడుగులు వేస్తోంది. భారత ఇంధన అవసరాల దృష్ట్యా ఈ నౌకల సురక్షిత ప్రయాణం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే ‘సిమి’ అనే ఎల్‌పీజీ నౌక గురువారం నాడు సురక్షితంగా ఒమన్ గల్ఫ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ ప్రయాణ సమయంలో నౌక తన ట్రాన్స్‌పాండర్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు నౌకాయాన వర్గాలు వెల్లడించాయి. ఈ నౌక ఖతార్‌లోని రాస్ లఫాన్ పోర్టు నుంచి గుజరాత్‌లోని కాండ్లా నౌకాశ్రయానికి వంటగ్యాస్ లోడ్‌తో వస్తోంది. క్లిష్ట పరిస్థితుల్లో కూడా భారత సరఫరా గొలుసు చెక్కుచెదరకుండా ఉండటం గమనార్హం. మరోవైపు యూఏఈలోని రువాయిస్ రిఫైనరీ నుంచి బయలుదేరిన ‘ఎన్వీ సన్‌షైన్’ అనే మరో నౌక కూడా జలసంధిని దాటిన తర్వాత తన సిగ్నల్స్‌ను నిలిపివేసింది. ఈ నౌక కర్ణాటకలోని మంగళూరు రేవుకు చేరుకోవాల్సి ఉంది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రయాణించే నౌకలు శత్రువుల కంటపడకుండా ఉండేందుకు ఇలాంటి సాంకేతిక జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. భారత్‌కు అవసరమైన ముడిచమురు ఎల్ఎన్‌జీ రవాణాలో అధిక భాగం ఈ మార్గం నుంచే జరుగుతుంది.



రాజకీయ పరిణామాల విషయానికి వస్తే ఇరాన్‌తో కాల్పుల విరమణ ప్రయత్నాలు ప్రస్తుతం క్లిష్ట స్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ‘ట్రూత్ సోషల్’ వేదికగా స్పందిస్తూ శాంతి ఒప్పందంపై ఇరాన్ పంపిన సమాధానం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని తీవ్రంగా విమర్శించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్ తన అభిప్రాయాలను అమెరికాకు తెలియజేసింది. చర్చలు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడం అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను కలవరపెడుతోంది. ప్రస్తుతం హర్మూజ్ జలసంధి ప్రాంతంలో భద్రతను పర్యవేక్షిస్తున్న దళాలు అప్రమత్తంగా ఉన్నాయి. భారత్ తన ఇంధన భద్రత కోసం నిరంతరం దౌత్యపరమైన చర్చలు జరుపుతూనే ఉంది. ఈ మార్గం గుండా సరఫరా నిలిచిపోతే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉంది. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టి శాంతి ఒప్పందం కుదిరితేనే వాణిజ్య నౌకల రాకపోకలు భయం లేకుండా సాగుతాయి. ప్రస్తుతానికి భారత నౌకలు సురక్షితంగా బయటపడటం ఊరటనిచ్చే అంశం.

# ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై దుమారం

**రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన న్యాయవాది**

**మత విశ్వాసాలను గాయపరిచారంటూ ఆందోళన**



**చెన్నై, మే 14**

తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు మరోసారి రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా ఆయన సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. గతంలో సనాతన ధర్మాన్ని మలేరియా, డెంగీ వంటి వ్యాధులతో పోల్చి, దానిని నిర్మూలించాలని ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. ఈ విమర్శల ప్రభావం ఇటీవల జరిగిన ఎన్నికల్లో డీఎంకే పరాజయానికి ఒక ప్రధాన కారణంగా నిలిచిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఉదయనిధి స్టాలిన్ చేసిన ఈ వివాదాస్పద వ్యాఖ్యలపై తెలంగాణకు చెందిన ప్రముఖ హక్కుల న్యాయవాది రామారావు తీవ్రంగా స్పందించారు. ఉదయనిధి వ్యాఖ్యలు హిందూ సమాజం యొక్క మత విశ్వాసాలను కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ ఆయన భారత రాష్ట్రపతికి అధికారికంగా ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతి కార్యాలయంలో దాఖలు చేసిన ఈ ఫిర్యాదులో ఉదయనిధి వ్యాఖ్యలను కేవలం భావప్రకటనా స్వేచ్ఛగా పరిగణించలేమని, అవి కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని రామారావు పేర్కొన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి ఒక నిర్దిష్ట ధర్మాన్ని కించపరచడం సమాజంలో విద్వేషాలను పెంచే ప్రమాదం ఉందని న్యాయవాది రామారావు తన ఫిర్యాదులో ఆందోళన వ్యక్తం చేశారు. సమాజంలోని శాంతిభద్రతలకు భంగం కలిగించే ఇటువంటి వ్యాఖ్యల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన కోరారు. ఉదయనిధి స్టాలిన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఏ మీడియా సంస్థలో గానీ, సోషల్ మీడియా లేదా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో గానీ ప్రసారం కాకుండా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్రపతిని అభ్యర్థించారు. ఉదయనిధి స్టాలిన్ తీరుపై ఇప్పటికే దేశంలోని పలు ప్రాంతాల్లో హిందూ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా ఆయన తన ధోరణిని మార్చుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు అన్ని వర్గాల ప్రజల విశ్వాసాలను గౌరవించాల్సిన బాధ్యత ఉందని, కానీ ఉదయనిధి ఉద్దేశపూర్వకంగానే సనాతన ధర్మాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ వివాదం ఇప్పుడు జాతీయ స్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వం లేదా రాష్ట్రపతి కార్యాలయం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఉదయనిధి వ్యాఖ్యల వల్ల డీఎంకే పార్టీకి రాజకీయంగా పెద్ద నష్టం వాటిల్లుతోందని పార్టీలోని కొందరు నేతలు అంతర్గతంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సనాతన ధర్మంపై ఆయన చేస్తున్న అటాక్ వల్ల ఇతర రాష్ట్రాల్లోని మిత్రపక్షాలకు కూడా ఇబ్బందికరంగా మారుతోందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రపతికి అందిన ఈ ఫిర్యాదుపై చట్టపరంగా ఎలాంటి విచారణ జరుగుతుందోనని రాజకీయ వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. ఈ వివాదం సద్దుమణగకపోతే భవిష్యత్తులో డీఎంకేకు మరిన్ని రాజకీయ ఇబ్బందులు తప్పవని తెలుస్తోంది.

# పేదింటి ప్రతిభకు ప్రభుత్వ పట్టు..

**ఇంటర్ టాపర్ సృజన్‌కు రూ.10 వేల ప్రోత్సాహకం**

**వేములవాడ, మే14**



ఇంటర్ లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి సృజన్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడకు చెందిన బీసీ హాస్టల్ విద్యార్థి వెల్దండి సృజన్ ఇంటర్మీడియట్‌లో 477 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. నిరుపేద కుటుంబానికి చెందిన సృజన్ హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. ఉత్తమ మార్కులు సాధించిన బీసీ హాస్టల్ విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సృజన్‌కు రూ.10 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందజేసింది. హైదరాబాద్‌లో కలెక్టర్ ప్రియాంక చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం కుటుంబ సభ్యులకు ఆనందాన్ని కలిగించింది. సదానందం--భవాని దంపతుల మూడవ సంతానమైన సృజన్ కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరాలని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

# ఉక్రెయిన్‌పై రష్యా క్షిపణుల వర్షం

**ఆరుగురు పౌరుల మృతి**

**800 డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడ్డ రష్యా సైన్యం**

**కీవ్ ఒడెసా సహా 20 ప్రాంతాల్లో భారీ విధ్వంసం**

**అంతర్జాతీయ సమాజం మద్దతు కోరుతున్న ఉక్రెయిన్**



**కీవ్, మే 14**

ఉక్రెయిన్ దేశంపై రష్యా తన దాడులను మరోసారి ఉధృతం చేసింది. గత కొంతకాలంగా నిరంతరాయంగా సాగుతున్న ఈ యుద్ధంలో భాగంగా తాజాగా రష్యా బలగాలు వికృత రూపం దాల్చాయి. ఉక్రెయిన్‌లోని కీలక నగరాలైన కీవ్, ఒడెసాతో పాటు సుమారు 20 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని రష్యా సైన్యం విరుచుకుపడింది. ఈ దాడుల్లో సుమారు 800 డ్రోన్లు, శక్తివంతమైన క్షిపణులను ప్రయోగించి భారీ ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించింది. రష్యా జరిపిన ఈ భీకర దాడుల కారణంగా ఇప్పటివరకు ఆరుగురు పౌరులు మరణించినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. క్షిపణుల తాకిడికి అనేక నివాస భవనాలు నేలమట్టమవగా, మరికొన్ని చోట్ల మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని స్థానిక అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాంబుల మోతతో ఉక్రెయిన్ గగనతలం దద్దరిల్లిపోవడంతో ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. పౌర నివాసాలే లక్ష్యంగా సాగుతున్న ఈ దాడులు ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థను, విద్యుత్ సరఫరాను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. ముఖ్యంగా విద్యుత్ గ్రిడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలపై రష్యా క్షిపణులు పడటంతో అనేక ప్రాంతాల్లో చీకట్లు ముసిరాయి. అత్యవసర సేవలకు కూడా ఆటంకం కలుగుతుండటంతో బాధితులకు వైద్య సహాయం అందించడం క్లిష్టంగా మారింది. రష్యా చేపట్టిన ఈ ఆకస్మిక దాడి ఉక్రెయిన్ రక్షణ వ్యవస్థను పరీక్షకు గురిచేస్తోంది. ఈ దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ ప్రభుత్వం అంతర్జాతీయ సమాజాన్ని అప్రమత్తం చేసింది. రష్యా ఆగడాలను అడ్డుకోవడానికి, తమ దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవడానికి మిత్రదేశాల నుంచి భారీగా సైనిక మరియు ఆర్థిక మద్దతు అవసరమని ఉక్రెయిన్ కోరుతోంది. ముఖ్యంగా అధునాతన గగనతల రక్షణ క్షిపణులను సరఫరా చేయాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేస్తోంది. రష్యా అమానవీయ చర్యలపై ఐక్యరాజ్యసమితిలో నిరసన తెలపాలని ఉక్రెయిన్ ప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం యుద్ధ ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వెలికితీయడానికి రెస్క్యూ టీమ్స్ శ్రమిస్తున్నాయి. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. రష్యా దాడులు ఇక్కడితో ఆగవని, రానున్న రోజుల్లో మరింత తీవ్రమయ్యే ముప్పు ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో ఉక్రెయిన్ ప్రజలు భయాందోళనల మధ్య గడుపుతున్నారు. యుద్ధం ముగిసి శాంతి నెలకొనాలని ప్రపంచ దేశాలు ఆకాంక్షిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయి.

# 21 ఏళ్లలోపు వారికి మద్యం విక్రయాలపై నిషేధం

**విజయ్ ప్రభుత్వం నిర్ణయం**

**చెన్నై, మే 14**



తమిళనాట 21 ఏళ్లలోపు వారికి మద్యం విక్రయించరాదని ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ‘తమిళనాడు స్టేట్ మార్కెటింగ్ కార్పొరేషన్’ (టాస్మాక్) సంస్థ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 21 ఏళ్ల లోపు వారికి మద్యం విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు చేపడతామని ఆ సంస్థ హెచ్చరించింది. మద్యం కొనుగోలుకు వచ్చే వారి వయసులో తేడా అనిపిస్తే వారి ఆధార్ కార్డు, లేదా డ్రైవింగ్ లైసెన్స్ పరిశీలించి మద్యం ఇవ్వాలని స్పష్టం చేసింది.

# సుప్రీం తీర్పు...గవర్నర్ల వ్యవహారం !



పదవీ విరమణ చేయబోతున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ బుధ, గురు వారాల్లో రెండు రాజ్యాంగ ధర్మాసనాలకు నేతృత్వం వహించి తీర్పులిచ్చారు. రాష్ట్రపతి న్యాయ సలహా కోరిన అంశంపై గురువారం ఏకాభిప్రాయంతో తీర్పు సంచలనంగానే పేర్కొనాలి. ఎందుకంటే తమిళనాడు కు సంబంధించిన పలు బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా తొక్కిపెడుతుండటంతో అక్కడి ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు గవర్నర్‌ను ఆదేశించింది. బిల్లులను తొక్కిపట్టే విధానాన్ని తప్పుబట్టింది. అయితే, గవర్నర్ మాత్రం బిల్లులను ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టు ద్విసభ్య బెంచ్ ఈ ఏడాది ఏప్రిల్ 8న సంచలన తీర్పు వెలువరించింది. గవర్నర్ రాజ్యాంగ విరుద్ధంగా పది బిల్లులను నిరవధికంగా తొక్కిపట్టారని ప్రకటించింది. రాజ్యాంగ విధుల్లో విఫలయ్యారని, రాజ్యాంగబద్ధ పాలన కూలిపోయే పరిస్థితి కల్పించారని మండిపడింది. బిల్లులు తిప్పిపంపకుండా దగ్గర పెట్టుకోవడం కుదరదని చెప్పింది. తిప్పి పంపిన తర్వాత మళ్లీ శాసనసభ ఆమోదిస్తే గవర్నర్ ఆమోదించాల్సిందేనని స్పష్టం చేసింది. గవర్నర్‌కు పంపిన బిల్లులు ఆమోదం పొందినట్లుగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మే 13న రాష్ట్రపతి ద్వారా సుప్రీంకోర్టును 14 ప్రశ్నలతో న్యాయ సలహా కోరింది. వాటికి సుప్రీంకోర్టు గురువారం సమాధానం ఇచ్చింది. వాదనల సమయంలో ఏప్రిల్ 8 నాటి సుప్రీంకోర్టు తీర్పును తోసిపుచ్చే ఉద్దేశం లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పదేపదే చెప్పారు. గురువారం నాటి తీర్పు కాపీలోనూ... మరో తీర్పును తోసిపుచ్చేందుకు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సలహా కోరడాన్ని ఉపకరణంగా వాడటం కుదరదని పేర్కొంది. ప్రత్యేకించి కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు ఆయా ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కొంత పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా బిల్లుల ఆమోదం విషయంలో వారు సకాలంలో నిర్ణయం తీసుకోవడం లేదు. లేదా తిప్పి పంపడం లేదు. ప్రధానంగా బెంగాల్, తమిళనాడు, తెలంగాణల్లో ఇలాంటి పరిస్థితులను చూశాం. అయితే రాష్ట్రపతి, గవర్నర్లకు బిల్లుల ఆమోదంలో గడువు విధించడం తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఇటీవలే తేల్చిచెప్పింది. ఈ తీర్పుతో ఇప్పుడు గవర్నర్ల వద్ద బిల్లులు పెండింగ్‌లో ఉన్నా ప్రశ్నించే అవకాశం లేకుండా పోయింది. అలాగే బిల్లులను సకాలంలో పంపాలన్న నిబంధన లేకపోతే వారు రాష్ట్ర ప్రభుత్వాలపై పెత్తనం చెలాయిస్తారని తమిళనాడు, బెంగాల్ తదితర రాష్ట్రలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో పార్లమెంట్ దీనిపై చర్చించాల్సి ఉంది. గవర్నర్లకు ఉండే వెసలుబాటులోనూ సమయాభావన ఉండాలన్న దానిపై చర్చించాలి. అవసరమైతే చట్టపరంగా మార్పులకు శ్రీకారం చుట్టాలి. అప్పుడే రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలకు ఆమోదం దక్కుతుంది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లుల ఆమోదంలో గవర్నర్ సొంత విచక్షణతో నిర్ణయం తీసుకోవచ్చని కూడా స్పష్టం చేసింది. అయితే, గవర్నర్ ఎటువంటి కారణం చెప్పకుండా నిరవధికంగా ఆలస్యం చేయడం తగదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చంద్రశేఖర్ సభ్యులుగా ఉన్న ధర్మాసనం అభిప్రాయపడింది. అటువంటి సమయంలో సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని గవర్నర్‌ను న్యాయస్థానం ఆదేశించవచ్చని చెప్పింది. రాష్ట్రాల శాసన సభలు ఆమోదించి పంపించిన బిల్లులకు గవర్నర్ సమ్మతి తెలిపే అంశానికి సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం గురువారం కీలక నిర్ణయాన్ని వెలువరించింది. రాష్ట్రపతి, గవర్నర్లు తీసుకునే చర్యలు న్యాయస్థానాల పరిశీలనకు అతీతం కాదని చెబుతూనే రాజ్యాంగ అధినేతలకు బిల్లుల ఆమోదం కోసం గడువు విధించడం సరైంది కాదని స్పష్టం చేసింది. రాష్ట్రపతి రాజ్యాంగాధినేత కావడం వల్ల కొంత ఆలోచన చేయవచ్చు. కానీ గవర్నర్లు ఈ విషయంలో కొంత రాజ్యాంగబద్దంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎందుకంటే బిల్లులను తొక్కిపెట్టి కాలయాపన చేయడం వల్ల తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయి. సుప్రీం తీర్పు తరవాత తమిళనాడు సిఎం స్టాలిన్ కూడా స్పందించారు. గవర్నర్లకు సమయం ఉండాలని, నిర్దేవజత గడువు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ జరగాలన్నారు. ఇకపోతే గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయని సుప్రీంకోర్టు తెలిపింది. ఒక బిల్లు గవర్నర్ దగ్గరికి వచ్చినప్పుడు అన్నీ పరిశీలించి సమ్మతి తెలియజేయడం లేదా ఏదైనా సహేతుకమైన కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం చేయాలి. లేదా బిల్లును తిరస్కరించి తిరిగి అసెంబ్లీకి పంపడం చేయాలి. కానీ చాలా సందర్భాల్లో అలా జరగడం లేదు. తమిళనాడు గవర్నర్ రవి ఇలాంటి నిబంధనలు పక్కన పెట్టారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న సమయంలో తమిళిసై సైతం ఇదే ధోరణితో ఉన్నారు. ప్రభుత్వాలు ఏదైనా నిర్ణయం తీసుకుంటే సకాలంలో ఔనని లేదా కాదని చెబితే బాగుండేది. కానీ దానిపై సమాధానం ఇవ్వక పోవడం అన్నది, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేదే తప్ప మరోటి కాదు. అయితే ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో రాజ్యాంగంలోని 200 నిబంధన కింద గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారని, అటువంటి సమయంలో న్యాయస్థానాలు గడువు విధించడం సరికాదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయ పడింది. బిల్లులకు ఆమోదం తెలిపేటప్పుడు కానీ, ఆమోదాన్ని నిలిపివేసే సమయంలో కానీ గవర్నర్ తన సొంత విచక్షణ ప్రకారం వ్యవహరించవచ్చని కూడా సూచించింది. అలాంటి సమయాల్లో మంత్రి మండలి సలహా ప్రకారం నడుచుకోవాల్సిన అవసరం లేదు. అయితే, సుదీర్ఘకాలం వివరించలేని కారణాల వల్ల ఒక బిల్లుపై నిర్ణయం తీసుకోకపోతే సహేతుకమైన సమయంలో నిర్ణయం తీసుకోవలసిందిగా కోర్టు గవర్నర్‌కు పరిమితమైన ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. 361 అధికరణ కింద వారికి రక్షణ కవచం ఉన్నప్పటికీ సుదీర్ఘమైన ఆలస్యం జరిగినప్పుడు హేతుబద్ధమైన సమయంలో బిల్లులను ఆమోదించేందుకు, తిరిగి పంపేందుకు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయవచ్చని తెలిపింది. ఇకపోతే తన పరిశీలనకు వచ్చిన ప్రతి బిల్లుపై రాష్ట్రపతి రాజ్యాగంలోని 143వ అధికరణం కింద సుప్రీంకోర్టు సలహా కోరనవసరం లేదు. గవర్నర్లు నిరవధికంగా ఒక బిల్లును తమ వద్ద ఉంచుకోరాదు అనేదే ప్రధానం. అందువల్ల పరిమితమైన న్యాయ సమీక్ష ఉండవచ్చని రాజ్యాంగ ధర్మాసనం తన ఏకగ్రీవ తీర్పులో అభిప్రాయపడింది. రాజ్యాంగంలో బిల్లును సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని ఉన్నప్పటికీ దాన్ని గవర్నర్లకు, రాష్ట్రపతికి డెడ్‌లైన్ పెట్టేందుకు రాజ్యాంగం ఇచ్చిన అనుమతిగా భావించనక్కరలేదని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. డెడ్‌లైన్ పెట్టి, ఆలోగా ఆమోదం ఇవ్వకపోతే లభించినట్లుగానే భావించడం రాజ్యాంగంలోని అధికారాల విభజన సూత్రానికి భంగం కలిగిస్తుందని తెలిపింది. మొత్తంగా గవర్నర్లకు ఇప్పుడు విచక్షణ ఉందని తేల్చింది. అంటే బిల్లులను ఎంతకాలమైనా పెండింగ్‌లో పెట్టుకునే అవకాశం ఉంది. అయితే అది ఎంతకాలం అన్న చర్చ జరగాలి. లేదా దానికి కూడా పరిమిత కాలం అంటూ ఉండాలి. అప్పుడే గవర్నర్ల పెత్తనం అతిగా ఉండదు. తమిళనాడు వ్యవహారం, సుప్రీం తీర్పు నేపథ్యంలో గవర్నర్లకు సంబంధించి తప్పకుండా చర్చచేయాల్సి ఉంది. ఇందుకు పార్లమెంట్ పూనుకోవాలి. ఇలాంటి విషయాల్లో విపక్షపార్టీ సభ్యులు చర్చకు పట్టుబట్టాలి. అప్పుడు సమస్యకు మార్గం దక్కగలదు.

## ఈ సమస్యలు ఉన్నవారు పొరపాటున కూడా క్యారెట్ తినకూడదు..!



క్యారెట్లు ఆరోగ్యానికి చాలా మంచివి. ఎందుకంటే వాటిలో విటమిన్ ఎ, బీటా-కెరోటిన్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ వంటి అవసంమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, గుండె ఆరోగ్యం, చర్మ సౌందర్యం వంటి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. అయితే, ఈ సమస్యలతో బాధపడేవారికి మాత్రం క్యారెట్లు అస్సలు మంచివి కావని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పొరపాటున కూడా వీరు తినకూడదని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, ఏ వ్యక్తులు క్యారెట్లు తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం..

**మలబద్ధకం:**
నేటి కాలంలో చాలా మంది జీర్ణ సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు క్యారెట్లు తినకుండా ఉండాలని నిపుణులు అంటున్నారు. తరచుగా కడుపు నొప్పులతో బాధపడేవారు క్యారెట్లు తినేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. క్యారెట్లలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది కడుపుకు మంచిది. అయితే, ఎక్కువగా తినడం వల్ల ఉబ్బరం, అజీర్ణం, గ్యాస్, మలబద్ధకం ఏర్పడతాయి.

**డయాబెటిస్**
డయాబెటిస్ అనేది ఈ రోజుల్లో చాలా మంది ఎదుర్కొంటున్న సమస్య. అందువల్ల, వారు తమ ఆహారం పట్ల చాలా శ్రద్ధ వహించాలి. ఎందుకంటే క్యారెట్లలో సహజంగా చక్కెర ఎక్కువగా ఉంటుంది. క్యారెట్లు ఎక్కువగా తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే అవకాశం ఉంది. అందువల్ల, ఈ సమస్యతో బాధపడేవారు వైద్యుడిని సంప్రదించిన తర్వాతే క్యారెట్లను ఆహారంలో చేర్చుకోవడం మంచిది.

**పాలిచ్చే మహిళలు**
పాలిచ్చే మహిళలు క్యారెట్లకు దూరంగా ఉండాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. క్యారెట్లు తల్లి పాల రుచిని మార్చగలవు, దీనివల్ల శిశువుకు పాలు తాగడం కష్టమవుతుంది.

**నిద్రలేమితో బాధపడేవారు:**
ఈ రోజుల్లో చాలా మంది నిద్రలేమితో ఇబ్బంది పడుతున్నారు. చాలా మంది ఒత్తిడి, ఆందోళన లేదా ఇతర కారణాల వల్ల సరిగ్గా నిద్రపోలేకపోతున్నారు. క్యారెట్ నిద్రకు మరింత అంతరాయం కలిగిస్తుంది.

**అలెర్జీలు**
చాలా మంది తరచుగా చర్మ అలెర్జీలతో బాధపడుతున్నారు. ఇది దురద, దద్దుర్లు, చర్మపు చికాకును కలిగిస్తుంది. కొంతమందికి క్యారెట్ తింటే అలెర్జీ ఉంటుంది. కాబట్టి, అలాంటి వారు క్యారెట్ తినకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## మరోమారు షాక్ ఇచ్చిన బంగారం ధరలు

### ఒక్కరోజే పది గ్రాములపై 1800 పెరుగుదల



**హైదరాబాద్ :** బంగారం కొనాలనుకునే వారికి ధరలు వరుస షాక్‌లు ఇస్తున్నాయి. తగ్గినట్టే తగ్గి భారీగా పెరుగుతున్నాయి. బంగారం ధరలుగతం పోల్చుకుంటే శనివారం భారీగా పెరిగాయి. ఒక్క రోజులోనే ఏకంగా పది గ్రాములపై 1800 రూపాయలు పెరిగింది. శుక్రవారం పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,23,980 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారెట్ల బంగారం ధర 1,13,650 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. 18 క్యారెట్ల ధర 92,900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి..పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,25,840 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల ధర 1,15,350 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 18 క్యారెట్ల బంగారం ధర 94,380 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, వెండి ధరలు కూడా భారీగా పెరిగాయి. 100 గ్రాములపై 300, కేజీపై 3 వేల రూపాయలు పెరిగింది. నిన్న(శుక్రవారం) 100 గ్రాముల వెండి ధర 16,100 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,61,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో 100 గ్రాముల వెండి ధర 16,400 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ ధర 1,64,000 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది.

### పురుషుల్లో ఆండ్రోపాజ్..

## ఈ సమస్య నుంచి ఎలా బయటపడ వచ్చంటే..?

మహిళల్లో మోనోపాజ్ దశ ఉన్నట్లే పురుషుల్లో సైతం ఒక దశ ఉంటుందన్న విషయం చాలా మందికి తెలియదు. అదే ఆండ్రోపాజ్. పురుషుల వయస్సు పెరిగే కొద్దీ టెస్టోస్టెరాన్ స్థాయిలు తగ్గిపోతాయి. ఈ విషయంపై మగవారు ఎవరూ అంతగా మాట్లాడరు. కానీ దీనిని నిర్లక్ష్యం చేస్తే బాధపడతారని మగవారికి వైద్యులు సూచిస్తున్నారు.

**లైంగిక ఆసక్తి..**
ఆండ్రోపాజ్ ప్రారంభమైన తర్వాత.. తొలుత శరీరంపై దాని ప్రభావం పడుతుంది. ఎంత నిద్ర పోయినా.. ఏమి అనిపించదు. ఉదయం నిద్రలేచిన వెంటనే ఫ్రెష్ అనిపించదు. గతంలో లాగా బాగా పని చేయలేరు. ఒక వేళ జిమ్‌కు వెళ్లినా.. ఆరోగ్యం మెరుగుపడటానికి కొంత సమయం పడుతుంది. అంతేకాకుండా కుటుంబంపైన లేదా లైంగిక ఆసక్తిపైన ఆసక్తి తగ్గుతుంది.

**కారణంగా లేకుండా కోపం, చిరాకు..**
తీవ్రంగా అలసిపోవడమే కాకుండా.. మనస్సు అస్థిరంగా ఉంటుంది. అకస్మాత్తుగా చిరాకు, విసుగు, నిరాశ పెరుగుతాయి. చాలా మంది పురుషులు ఈ బాధను వ్యక్తపరచ లేకపోతారు. నాదేం తప్పు అంటూ కుటుంబ సభ్యులను ఎదురు ప్రశ్నిస్తారు. ఈ తరహా వైఖరితో కుటుంబ సభ్యులనే కాదు.. బంధువుల మధ్య సంబంధాలు సైతం సన్నగిల్లుతాయి.

**వ్యర్థం అనే భావన..**
టెస్టోస్టెరాన్ స్థాయిలు పడిపోయినప్పుడు.. ఆత్మవిశ్వాసం సైతం తగ్గిపోతుంది. తన చేతుల్లో ఏమీ లేదని.. గతంలో లాగా తాను లేనని భావిస్తు ఉంటారు. దీనిని మిడ్ లైఫ్ సంక్షోభమని పేర్కొంటారు. ఈ దశలో సందేహాలు తలెత్తడం ప్రారంభమవుతుంది. దీనిని అస్థిర స్థితిగా చెబుతారు.

**కుటుంబంలో ఘర్షణలు..**
భర్త నిత్యం మౌనంగా.. కోపంగా ఉంటే భార్య ఏమనుకుంటుంది? ఆమె తప్పుగా భావించుకుంటుంది. ఆయన.. తనను ప్రేమించడం లేదని అనుకుంటుంది. కానీ అసలు విషయం ఏమిటంటే.. ఇది అతని తప్పు కాదు.. ఇది కేవలం హార్మోన్ల మాయాజాలం వల్ల ఇలా జరుగుతుంది. ఈ కమ్యూనికేషన్ గ్యాప్ కారణంగా.. కుటుంబంలో అనవసరమైన ఘర్షణలకు కారణమవుతుంది.

**ఇది వ్యాధి కాదు..**
దీనిని దాచి పెట్టే బదులు.. దీనిపై బహిరంగంగా మాట్లాడాలి. మహిళల్లో మోనోపాజ్ ఉన్నట్లే పురుషుల్లో ఆండ్రోపాజ్ ఉంటుందని గమనించాలి. అదీకాక ఇది మీ వ్యక్తిగత వైఫల్యం కాదని.. అర్థం చేసుకుంటే సగానికి సగం టెన్షన్ తగ్గుతుంది. అందులో సిగ్గుపడాల్సిన అవసరం ఏ మాత్రం లేదనే విషయాన్ని గ్రహించాలి.

**పరిష్కార మార్గం..**
ఇలాంటి సమయంలో కుటుంబంలో మద్దతు.. మరి ముఖ్యంగా భార్య అవగాహన చాలా ముఖ్యమనే విషయాన్ని గ్రహించాలి. అవసరమనుకుంటే వైద్యుల కౌన్సెలింగ్ తీసుకోవాలి. తద్వారా మీ మనస్సు తెలికపడుతుంది. అలాగే ఇష్టమైన ఆహారాన్ని బాగా నమిలి తినాలి. శుభ్రంగా నిద్ర పోవాలి. నడవడం లేదా వ్యాయామం చేయడం మరి ముఖ్యం. మీ జీవనశైలిని మార్చుకుంటే.. ఈ ఆండ్రోపాజ్ సమస్యను సులభంగా అధిగమించవచ్చు.

మన సమాజం
తెలుగు డిజిటల్ దినపత్రిక
శుక్రవారం, మే 15, 2026



## స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే ఉండిపోయా

### రాజాసాబ్ సినిమాపై మాళవికా మోహనన్

సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం మొద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి. ఆ నీటిలోనే 3 రోజులు షూట్ చేశాం. అదొక వింత అనుభవం' అని మాళవికా మోహనన్ అన్నారు. ఇకపోతే హారర్ ఫాంటసీ కామెడీ చిత్రంగా 'రాజాసాబ్' రానుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదని దర్శకుడు మారుతి తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆడియన్స్ వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారని చెప్పారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్‌దత్, బొమన్ ఇరాని, జరీనా వహాబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

## అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ

### లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్



టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ప్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం. ఈ డీల్ విలువ వందల కోట్లలో ఉండొచ్చన్న ప్రచారం ఇండస్ట్రిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రిలీజ్‌కు ముందే ఇలాంటి రేంజ్ బిజినెస్ జరగడం బన్నీ మార్కెట్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.మరోవైపు, తన తాజా చిత్రం 'కూలీ'పై వచ్చిన విమర్శలపై దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇటీవల స్పందించారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్నానని, ఎక్కడ తడబడ్డామో విశ్లేషించుకున్నానని తెలిపారు. తదుపరి సినిమాల్లో మరింత బలమైన కంటెంట్‌తో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో అల్లు అర్జున్‌తో ఆయన చేయబోయే సినిమా మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందన్న అంచనాలు మరింత పెరిగాయి. మొత్తానికి అట్లీతో ఒక గ్రాండ్ సైన్స్ ఫిక్షన్ విజన్, లోకేశ్ కనగరాజ్‌తో ఒక రఫ్ అండ్ రియల్ ప్రాజెక్ట్ ఈ రెండు కాంబినేషన్లతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి

### లైన్ క్లియర్.. సాయిపల్లవి హిందీ

## డెబ్యూ సినిమా రిలీజ్‌పై క్లారిటీ..!

మూవీ లవర్స్‌కు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ సాయిపల్లవి. ఈ కోలీవుడ్ అమ్మడు తెలుగు, తమిళం, మలయాళంలో సినిమాలు చేస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఇక హిందీలో కూడా సాయిపల్లవి తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అవుతుందని తెలిసిందే. బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ నటిస్తోన్న మేరే రహా సినిమాలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేశారు మేకర్స్. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ఫైనల్ చేశారన్న వార్త బయటకు వచ్చింది. లేటెస్ట్ టాక్ ప్రకారం మేరే రహా చిత్రాన్ని జులై రెండో వారంలో విడుదల చేయబోతున్నారట. రిలీజ్ డేట్‌పై మేకర్స్ రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి సాయిపల్లవి ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న హిందీ డెబ్యూ మూవీ ఈ ఏడాది సెకండాఫ్‌లో థియేటర్లలో సందడి చేయనుందన్న వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు అభిమానులు, మూవీ లవర్స్. 2025లో తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సాయిపల్లవి. ఈ భామ ఖాతాలో మరో మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ రామాయణ ఉంది. ఈ మూవీ రెండు పార్టులుగా రాబోతుంది. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న మేరే రహా మూవీని సునీల్ పాండే డైరెక్ట్ చేస్తున్నాడు.

